
# దొంగ! దొంగ!

సర్వోత్తమ్



ఆ బాత్‌రూం చీకటి గుయ్యారం! నీళ్ల కుండీ ప్రక్కన నల్ల తుమ్మ మొద్దులాంటి మనిషి నక్కి కూచున్నాడు. ఆ చీకటిలో ఆ లుంగీ మాత్రం తెల్లగా కనిపిస్తుంది!

బయట జనం!.... "ఇక్కడే ఎక్కడో దాక్కున్నాడ్రా దొంగ! యీ బాత్‌రూంలోగాని దూరాడేమో!" అని అన్నాడొకడు.

"నన్ను చూడగానే యిటే పారిపోయాడ్రా! చూడండి సరిగ్గా! జాగ్రత్త!" మొదటివాణ్ణి హెచ్చరిస్తూ అన్నాడింకో యువకుడు.

"ఒరేయ్... తప్పుకోండిరా! నా కొడుకు చిక్కాడా? చచ్చాడా!" అన్నాడింకోడు కోపంగా.

"మెల్లగా! చీకటి ఏం కనుపించటం లేదురా! ఆ మూల ఏదో తెల్లగా ఆ... యిక్కడే ఉన్నాడు రండిరోయ్!" అని గట్టిగా ఎలుగెత్తి పిలిచాడందర్నీ బయటికడుగేస్తూ.

"రారా బయటికి! వచ్చావా సరేసరి! లేకపోతే మా చేతిలో చచ్చావన్నమాటే!"

* * *

ఒక ప్రక్క - "దొంగ!" "దొంగ!"

"రాజుగారూ తలుపు తీయండి. మీ ఇంట్లో దొంగబడ్డాడు! తలుపుతీయండి!"

గేటు గెడియ శబ్దం చేసినా తలుపు తెరుచుకోలేదు. గేటు ఎక్కి తలుపు తీసుకుని అందరూ లోపలికి జొరబడి దర్వాజా తలుపుల మీద చేత్తో తలుపులు తడుతూ, "రాజుగారూ! దొంగ... రాజుగారూ దొంగ!" అని గట్టిగా అరిచారు.

"ఎవరూ?!" అని కళ్లు నులుముకుంటూ ఆ ఇంటి యజమాని రాజారావు తలుపు తెరిచాడు. ఒక్కసారిగా గుప్పుమంది వాసన!

ఒకాయన ముక్కు మూసుకుంటే, యింకో ఆయన కోపంగా, "సందు సందంతా మేలుకుంటే... మీ ఇంట్లో దొంగపడితే మీకెలా నిద్రపట్టింది బాబూ!" అని అడిగాడు.

"నాకేం.... తెలీదే!" అన్నాడు ముద్దగా మాట్లాడుతూ రాజారావు.

"గోడ దూకి దొంగపడ్డాడు మీ ఇంట్లో!"

"ఆ..... లోపలికి ఎవరూ రాలేదే! అటు యిటూ తలుపులు వేసే ఉన్నాయి!" అని అన్నాడు రాజారావు.

"ఆ సందులోంచి ఆ ప్రక్క దొడ్లో దూకేశాడేమో చూడండిరా!" అని ఒకళ్లు అంటుంటే, "అటు అంతా చీకటి! అటు అస్సలు పోలేదు. ఇటే ఎక్కడో నక్కాడు! ఆ వెనుకాల బాత్‌రూం... మీరు కొంచెం దొడ్లో లైటు వెయ్యండి!" అని అన్నాడొక పెద్దాయన.

అందరి చేతుల్లోనూ కర్రలున్నాయిగాని, కనీసం ఒక్కడి దగ్గరా టార్చిలైటు కూడా లేదు!

* * *

ఇంకో ప్రక్క రోడ్డు మీద అరుపులు! కేకలు.

అర్థరాత్రి. అయినా అందరి ఇళ్లల్లో లైట్లన్నీ వెలిగిపోతున్నాయి! ఆ వీధి జనం అంతా ఆడా మగా... పెద్దోళ్లు... ముసలోళ్లు అందరూ వీధిలోకి వచ్చి రాజారావు ఇంటి ముందు గుమిగూడారు.

"మన సందులో యిన్ని సంవత్సరాలుగా ఎన్నడూ ఒక దొంగతనం జరగలేదు!" అని ఒక అమ్మ బుగ్గలు నొక్కుకుంటూ అంటే-

"అంత ధైర్యం ఎవరికుంది?" అని ఇంకో ఆయన.

"గోడ దూకాడట!"

"ఆ గోడ ఏముంది? మధ్యలో గట్టుంది. దానిమీద కాలేసి ఇట్టే లోపలికి తేలిగ్గా జంప్ చేసుంటాడు!" అని ఇంకో ఆయన.

"ఇన్ని ఇళ్లు ఉన్నాయి! ఆ ఇంటిలోనే ఎందుకు పడ్డాడొంగ?" అని జనం గుంపులుగా జేరి తలా ఒక మాటా మాట్లాడుకుంటున్నారు.

ఆ సందుకు అటు ప్రక్కగా ఉన్న ఇంట్లోంచి ఒకామె గబగబా జనం మధ్యలోంచి ఆ ఇంటిలోపలికి దూసుకెళ్ళింది!

* * *

"రారా! బయటికి!" అని అరిచి యిటు ప్రక్కకు తిరిగి ప్రక్కవాడితో, "రావటం లేదురా! యిద్దరం కలిసి వెళదాం లోపలికి" అని ఇద్దరూ ధైర్యం తెచ్చుకుని ఒకడు కర్ర రెడీగా పైకెత్తి పట్టుకుని, ఇంకోడు అడుగు ముందుకేశాడు బాత్‌రూం లోపలికి.

"అయిపోయింది నా పని!" అని అనుకుని నెమ్మదిగా మూలన నీళ్ల కుండీ ప్రక్కనుంచి లేచి నిలబడ్డాడు. ఆరడుగుల మనిషి! నల్లగా చీకటిలో కలిసిపోయాడు.

ముందుకడుగేసినోడికి ధైర్యం చాలలేదు. అయినా సరే, "పట్టుకోండి! దొంగ! దొంగ!" అని అరిచాడు.

ఒక్క ఉదుటున జనం మధ్యలోంచి దూసుకొని వెళ్దామనుకున్నాడా దొంగ! ముందుకు కదిలాడు.

అప్పుడే దొడ్లో లైటు టప్‌మని వెలిగింది!

పైకి లేపి నెత్తి పగులగొట్టటానికి సిద్ధపడిన కర్రలు అన్నీ అలానే గాలిలో నిలబడిపోయాయ్!

"మా ఆయన! కొట్టకండి బాబూ! మీకు దణ్ణం పెడతాను!" అని అంటూ ఆ దొంగకి అడ్డం వెళ్లి, అందరికీ రెండు చేతులెత్తి నమస్కారం పెట్టేసిందా ఇల్లాలు!

జనం తెప్పరిల్లి చూసేప్పటికి ఆ దొంగ ఎవరోకాదు! రోడ్లు భవనాల శాఖలో పనిచేసే పక్కింటి ప్రసాదరావే! ఆయనకు అడ్డుగా నిలిచినామె ఆయన భార్య కాంతమ్మ!

క్షణం తెల్లబోయారు! ఎత్తిన కర్రలు అలానే దిగిపోయాయి!

"బ్రతికిపోయావు పో! నిన్ను చూసి గాదు, నీ భార్య మొఖం చూసి!" అని అంటుండేలోగానే మొగుడి చెయ్యిపట్టుకుని బయటికి లాగుతూ, జనం నుండి తప్పించి బయటకు తీసుకొచ్చేసింది కాంతమ్మ.

ఎదురుచూస్తూ గుమిగూడిన జనం నోట మాటరాలేదు! నిశ్శబ్దంగా నిలబడిపోయారు ఒక్క క్షణం!

మొగుణ్ణి నెట్టుకుంటూ ఆ సందు అవతల ప్రక్కనే ఉన్న ఇంటిలోకి నెట్టి, తలుపులు ధబేలుమని బిడాయించింది కాంతమ్మ!

మేడ మీద నుంచి, ఎదుటి గుమ్మాల్లోంచి, బయటున్న జనం, చివరికి రాజారావు వింతగా నిర్ఘాంతపోయారు!

"దొంగ, దొంగ అని మేం పిలుస్తూవుంటే నాకేం కానట్టు తలుపు తీయలేదు. చూశావుగా రాజు! మేం ఎన్నో రోజులు రాత్రుళ్లు జరిగే యీ గోడ దూకుడు భాగోతం చూసి, విసిగి, దీని అంతు ఏదో తేల్చుకోవాలని వచ్చాం! దొంగ ఎవడో తెలిసిందా. మీరు ఉన్నపుడు గోడ దూకుతున్నాడో లేక లేనప్పుడు కూడ దూకుతున్నాడో! అక్కడ ఆ సందవతల కిటికీ తెరిచివుంటుంది! ఇక్కడ యీ యింట్లోనుండి రెండు మూడు సార్లు వెంట వెంటనే లైటు వెలిగి ఆరిపోతూవుంది! అక్కడ ఆయన లైటు వెలిగించి ఆర్పేస్తారు! అంటే దానర్థం లైన్ క్లియర్ అని సిగ్నల్స్ అన్నమాట! ఈలోగా "ఒకటికి!" అన్నట్టుగా లుంగీ మీద బయటకొచ్చేస్తాడు పెద్ద మనిషి! చటుక్కున గోడదూకుతున్నాడు! దీన్నిబట్టి అక్కడేం జరుగుతుందో, మేం చెప్పఖ్ఖర్లేదనుకుంటాను! నీ భార్య అతనికి సిగ్నలు ఇవ్వటం, అతను గోడ దూకటం... యీ రకంగా రాచలీలలు జరుగుతున్నాయి! ఈ బజార్లో అంతా ఇంతో, కొద్దో గొప్పో మర్యాదగా బతుకుతున్నవాళ్లం! నీ భార్యని అదుపులో పెట్టుకో!" అని ఒక పెద్దాయన... ఆయన పేరు సుబ్బారావు... గట్టిగా చెప్పాడు రాజారావుతో.

ఇంతలో బయటికొచ్చిందా ఇల్లాలు!

"ఎన్నిసార్లు పిలిచినా, తలుపులు తియ్యరేమ్మా?" అని అడిగాడాయన.


"బయట ఏదో గొడవ జరుగుతుంది. అరుపులు వినిపిస్తున్నాయి! ఈ అర్థరాత్రి సమయంలో తాగుబోతు గలాటా ఏమన్నా ఏమో అని అనుకున్నాను" అని అందామె.

ఇవన్నీ కిటికీలోంచి వింటూనే కోపం పట్టలేక తలుపులు తెరుచుకుని, ఉగ్రరూపంతో బయటికొచ్చింది కాంతమ్మ!

"ఏయ్! ఈ సందులో నా మొగుడే కావలసివచ్చాడే నీకు! యీ సందులో ఇరవై ఏళ్ళనుండి కాపురం చేస్తున్నాం! నా గొంతు ఎవరికయినా వినిపించిందా అసలు! ఈ రోజున మమ్మల్ని బజార్న పడేశావు గదే!"

"నేనలా అనుకోలేదు..." అని ఇంకా ఏదో చెప్పబోయింది సరోజిని'

"నీ సాని వేషాలు ఈ సందులో చెల్లవ్! ఇంక



మూసుకుని లోపలికి దూరు!"

"అది గాదండీ!..." అని ఇంకా సాగదీయబోయింది.

"ఎక్కువగా మాట్లాడకు! నాకు తిక్కరేగిందంటేనా... ఏం చేస్తానో నాకే తెలియదు! నీ చరిత్ర ఎవరికి తెలియదనుకోకు! జాగ్రత్త!" అని అంటూ సుడిగాలిలా ఎలా వచ్చిందో అలానే వెళ్లిపోయింది కాంతమ్మ.

"పరువుగా పదిమంది ఆడపిల్లలుగలవాళ్లం! నీమాట మీ ఆయన నమ్మాల్సిందే!.... మీ ఆయనేమో మందుకొడ్తాడు!... మత్తులో నిద్రపోయిన తర్వాత నీ యిష్టారాజ్యం!"

"పదండిరా! పదండి! రెండున్నరయిపోయింది!" అని అంటూ ఆవలింతలు తీశాడో యువకుడు!

అంతే! అందరూ వెళ్లిపోయారు! ఒక్కొక్కళ్లు తలుపులేసుకుంటూ లైట్లు ఆర్పేశారా సందులో.

* * *

ఈరకమైన నలుగురు హర్షించలేని అపవిత్రబంధానికి బలిగా రెండు కుటుంబాలు విచ్ఛిన్నమయి పోయే స్థితికి వచ్చింది!

శ్రీమతి సరోజినిని పుట్టింటికి పంపేశాడు భర్త! ఇద్దరు పిల్లలు తండ్రి దగ్గరే ఉండిపోయారు! పుట్టింటి దగ్గర అన్నదమ్ములు పెడ్తున్న చీవాట్లు తింటూ, తన ఇంటిని కూల్చుకున్నందుకు.... నిత్యం వేదన, తపనతో కాగిపోవలసివచ్చింది.

ఇటు ప్రసాదరావు, కాంతమ్మలు రోజూ ఇంట్లో జగడాలే! అప్పటికే వీధిలో 'దొంగ' కాస్తా 'దొంగనాకొడుకు' అని అంటుంటే తలెత్తుకు తిరగలేకపోతున్నాడు. ఈ దశలో ఇంట్లో ఇల్లాలి సూటిపోటి దెప్పి పొడుపు మాటలతో పడలేక, తెగించి తిరగబడి మాట్లాడాడోసారి! దాన్కి పర్యవసానంగా, కాంతమ్మ లాయరును సంప్రదించి విడాకుల ప్రయత్నంలో పడింది! ఇంట్లో ఎదిగిన కూతుళ్లూ తననో శత్రువులా చూస్తున్నారు! ఇంట్లో ఉండటం ఇష్టంలేక ఆఫీసుకు వెళితే 'గంధసాంగుడొచ్చాడు' అని చాటుమాటుగ స్నేహితులు అనుకుంటున్న మాటలు చెవిని పడ్తున్నాయి. వేళకి తిండి, కంటికి నిద్ర లేదు. తనతో స్నేహం చేసిన పాపానికి సరోజిని దుస్థితిని తలచుకుంటే, ఆమె సంసారం ఇలా కాలి బూడిదగావటానికి తనే కారణమని అంతరాత్మ సైతం అపుడపుడు ఒంటరిగా ఉన్నపుడు నెత్తిమీద మొదుతుంది!

* * *

"సత్యంగారూ! సమాజం స్త్రీనే ఈ విషయంలో దోషిగా చేసి పెద్ద తప్పు చేస్తుంది గదూ?"

"స్త్రీ ఒక్కదానికే దండనా?!, పురుషునికే దండన లేదా అని మీ ప్రశ్న అనుకుంటానూ!"

"పురుషుడు కూడ సాంఘిక బహిష్కరణ అనే దండన అనుభవిస్తాడు. అయినా సమాజంలో శవంలా తిరుగుతాడు."

"ఎందుకని?... పురుషుడు ఆర్జన పరుడనా?"

"స్త్రీ కూడ అర్జనపరురాలైతే సమాజాన్నే ఎదిరించి బతకగలదు. అదెప్పుడూ?.... ఆమె ఒంటరిదయి భర్త పోయి దిక్కులేనిదై ఉద్యోగం ఉంటే ఆస్థిదే!"

"సంసారాల్లో ఇటువంటి పరిస్థితులు వచ్చినపుడు ఆ స్త్రీ గతి ఇక అంతేనా?"

"ఆమెని ఏలుకునే భర్తని బట్టి ఉంటుంది ఆమె భవిత! తెలియకచేసినా, తెలిసి చేసినా, నిప్పు... నిప్పే! అది కాల్చి తీరుతుంది!"

"భార్య తప్పు చేస్తే భర్తకి కూడ అందులో బాధ్యత ఉందంటాను. భార్యను సమర్థవంతంగా తన చెప్పుచేతల్లో ఉంచుకోలేనివాడ్ని చవట అని అంటుంది సమాజం!"

"కాబట్టి ఒకరి దోషాన్ని మరొకరు పంచుకోవాలి! ఒకరినొకరు మన్నించుకోవాలి!... వాళ్ల కోసంగాదు! తాము కన్న పిల్లలు రేపు తమని ఎలా చూస్తారు? సంఘంలో వాళ్ల పరిస్థితి ఏంటి అని కూడా ఆలోచించాలి!"

"అవును శేఖరంగారూ! ఈ రోజుగాకపోయినా రేపయినా తన తప్పు తెలుసుకుని నా పిల్లలు లేందే నేను బ్రతకలేను. నన్ను క్షమించండి అని అంటుంది స్త్రీ! అప్పుడు ఆ భర్త క్షమించాలంటారా.... వద్దంటారా?"

"ఎటువంటి కష్టంలోనూ చేయివదలను అని చేసిన బాసకి అర్థమే... క్షమ అంటే!?"

"అలా క్షమించలేని పురుషుని జీవితంలోకి ఇంక ఏ స్త్రీ ప్రవేశించలేదు! ఏ స్త్రీ సాంగత్యానికి అతను పనికిరాడు!"

"కట్టుబాటుగా నీతి - నియతితో, అభిమానం, ఆప్యాయతతో, పాలూ- నీరులా కలసిమెలిసి జీవిస్తూ, కష్ట సుఖాల్ని సమంగా పంచుకుంటూ, పురుషుడు నేర్పుగా, స్త్రీ ఓర్పుగా జీవించటమే సంసారం అన్నారు పెద్దలు!"

వీరిద్దరి సంభాషణ కిటికీలోంచి విన్న రాజారావు, ఒక్క క్షణం ఆలోచించి, ఫోన్ తీసి అత్తింటివారి నెంబరుకి రింగ్ చేశారు! బ్రాందీ బాటిల్ బయటికి గిరాటేశాడు!

సత్యం శేఖరాలిద్దరూ అటు తిరిగారు, ఒకళ్ల మొహాలొకరు చూసుకున్నారు.

"వాళ్లిద్దరికి వినబడేటట్లుగా" యింటి ముందుచేరి ఇంకేం పనిలేనట్లు మా సంసారాన్ని గురించే అరుగుల మీద చేరి మాట్లాడుకుంటారు! అంతా దొంగలు!" అని అంటూ విసురుగా కిటికీ తలుపేశాడు రాజారావు.

"చూశారా శేఖరంగారూ?" అని సత్యం అన్నాడు.

"మీరు చెబితేనేనా.... నేను వినాలి! అని సూటిగా చెప్పకుండా యిలా అన్నాడులెండి!"

"నిజమే! సంబంధం లేని విషయాల్లో తల దూర్చేవాళ్లే దొంగలు!.... సమాజం ఎట్టాపోతే మాకేం అని అనుకోకుండా 'ఇటువంటిది ఇక్కడ జరక్కూడదు!' అని గుట్టు చప్పుడుగా సాగుతున్న వ్యవహారాన్ని రచ్చకీడ్చినవాళ్లు దొంగలు! భర్తను అదుపులో పెట్టుకోకుండా యిన్నాళ్లూ చూస్తూ... చివరిక్షణంలో మొగుడి నెత్తిమీద పడుతున్న కర్రలకు నమస్కారం పెట్టినామె దొంగ!.. మందుగొట్టి, గుర్రుపెట్టి నిద్రపోతూ ఇంటిలో ఏం జరుగుతుందో తెలుసుకోలేనివాడు దొంగ!"


"భార్యకు ద్రోహంచేసిన భర్త దొంగ! అలానే భర్తకు ద్రోహం చేసిన భార్య దొంగ!"

"ఈ విషయంలో స్త్రీ ఒక్కతే దోషి... అన్న స్వార్థపరుడే.... దొంగ!"

"మానాభిమానాలు వదిలి, వావి వరుసలు మరిచిన మృగాన్ని..... నలుగురిలోనూ పెద్ద మనిషిగా చూసేవాడూ... ఘరానాదొంగ!"

"క్షమాగుణాన్ని అపార్థం చేసుకుని, అలుసుగా తీసుకుని... తిరిగి అదే నేరం చేసేవాడే వ్యభిచారి!... వాడే పెద్ద దొంగ!"

❋



## పునర్జన్మ

అమ్మాయే నవ్వితే సినిమాకి మంచి టాక్ వచ్చింది. రాజేంద్రప్రసాద్ మార్క్ చిత్రం ఇది అంటున్నారు.

ప్రేక్షకుల ఆలోచనా ధోరణి మారింది థియేటర్లో వున్న రెండుగంటలూ హాయిగా నవ్వుతూ ఎంజాయ్ చేయాలి. అదే జరిగిందీ చిత్రంలో. మళ్ళీ రాజేంద్రప్రసాద్‌కి పునర్జన్మ ఈచిత్రం అంటున్నారు.